# "పెరసనల్"

★

రచన :
"ఫల్గుణ"

"ఏమా అమ్మా నాన్నగారూ తిరుపతి వెళ్తున్నార్రా! వీలుంటే నన్నూ రమ్మన్నారు" అంటూ ఉత్తరం మడిచాడు కైలాసం.

"ఇంకా ఈ డేస్‌లో దేముడూ తిరపతీ ఏమిట్రా మీనింగ్‌లెస్" అన్నాడు శంకరం.

"ఒరే ఒరే తప్పురా! అలా అనకూడదు. అందులో తిరుపతి వెంకటేశ్వర్లు గురించే! వెధవా ఫ్యూచరు రూయిన్ అయిపోయింది!" అన్నాడు కామేశం.

"భాస్కరం చంద్రం సింపుల్‌గా చూస్తున్నారు ఫార్సు.

"వాడికా! వాడికి ఫరవాలేదు. వాడు.... పదహారణాల ఇండియన్. ఇంకా మాట్లాడితే నూరు నయా పైసల ఆంధ్రుడు" అన్నాడు కైలాసం.

ఒక షాక్ తిన్నారందరూ "వాడ్డూ యూ మీన్....?" అన్నాడు చంద్రం.

"అదేమీనూ కాకపోతే ఏమిట్రా ? ఏమిటో డేస్ అటడేస్....!"

"ఒరే మీరంతా సిల్లీ" అన్నాడు శంకరం. 'అంతా ఆర్థడాక్స్'

"కిడ్డర్‌పూల్ డాక్స్ కావూ?"

"గాని ఆంధ్రుల్ని అంతలా అనడం బాగు లేదురా!"

"అఫ్‌కోర్సు! నేనూ వప్పుకుంటాను. ఒరే ఇందులో మన మెవరమైనా ఆర్నెల్లలోపుని ఒకసారైనా దేవాలయానికెళ్ళామా? ఒక్కడు చెప్పండి!"

ఎవరూ వెళ్లలేదని అందరూ వప్పేసుకున్నారు.

"నేష్టి ఐనా దేవాలయానికెవడు వెళ్తాడ్రా? ఎడ్యుకేటెడ్‌ఫెలో? ఎవడైనా చూసేడంటే డేమ్ షేమ్? శంకరం ఆముదం ముఖం పెట్టేడు.

"నేష్టి అయినా! ఇదీ మన ఆంధ్రుల స్టేన్‌డర్డ్. ఇదే క్రిష్టియనైనైతే రెగ్యులర్‌గా చర్చికి వెళ్తారు, ఎన్నిపనులైనా సరే మానేసి. వాడు ఆంగ్లో ఇండియనైనా, కనీసం ఇండియనైనా (హిందువుడు కాకుండా) క్రిష్టియనైతే చర్చికి వెళ్లడం తప్పడు."

"నిజమేరా మన విలియమ్ చూడు నన్‌డే నాడు వాడూ, వాడి మేకప్ ఓహో" అన్నాడు భాస్కరం.

"అదలాగ!ఉండనీలే, మహమ్మడన్ అనుకో మసీదుకు ఖచ్చితంగా వెళ్తాడు. బీదా గొప్పా చిన్నా పెద్దా భేదమే లేదు. డెయిలీ నమాజు కంపల్సరీ."

"యు మీన్ టు కంపేర్!....చర్చే ఉందనుకో ఎంత డీసెంటుగావుంటుంది? వాళ్లంతా డీసెన్సీమెంటైన్ చేస్తార్రా!"

"మనం స్టైయిల్ మెంటైన్ చేస్తాం!"

"ఆ....మరి లేకపోతే....స్టైయిల్‌గా ఐరన్ పోని డ్రస్‌వేసుకుని ఫుల్ స్వింగులో దిల్‌గా ఉండకపోతే, జెస్ట్ ము క్కు మూ సు కు ని మంత్రాలు చమవు...."

"ఆగరా శంకరం ఆగు....అదికూడా అయిపోయింది. పత్రికలు చూడలేదూ ! మంత్రాలంతా బ్లైయిండు బిలీఫ్ అంటూ ధంచిపారేస్తున్నారు. అంతా మెంటల్ ఎండ్ సైకలాజికల్ ఫీలింగ్సు అని ధమాయించేస్తున్నారు."

"గుడ్‌గాడ్ రకించావు. పోనీలేరా కామేశం కొంత నయం ఫరవాలేదు. మనిషికి మైండు సైకాలజీ ఉన్నాయనైనా వప్పుకున్నారు. థేంక్స్" అన్నాడు భాస్కరం.

"అది సరి, ఈమధ్యని అసలు జ్యోతిషం అన్నది శాస్త్రం కాదు, అసలు ఏమీకాదు, ఏదో పేరుకి అంటూ వుంది; అది వట్టి 'అమ్మమ్మాయణం' తప్పిస్తే మిగిలింది సున్నా అంటున్నారు అతిరథమహారథులందరూను."

"చదవేస్తే ఉన్నమతిపోయిందట. కాకరకాయ కీకరకాయౌతుంది!"

"కీ క ర కా య తో ఆగినా బాగుండును. రాకెండ్‌రోల్ కీ క్ రా య్ కా య్" అన్నాడు చంద్రం—గొల్లుమన్నారందరూ.

"ఒరే మీరెంత తన్నుకుచచ్చినా! వెస్టర్‌లైజేషన్‌లోవున్న బ్యూటీ ఎందులోనూలేదురా! దటీజ్ ఫాక్ట్" అన్నాడు శంకరం ఉడుక్కుని.

"పోనీ అదైనా తిన్నగా ఏడుస్తారా? ఏరాయైతేనేం పళ్ళూడగొట్టుకోడానికి? అందులో మళ్ళా పెరసంటేజి. వాళ్ళు అధమం వారానికొకసారైనా అంతా సమావేశమౌతారు. రోజూ తనలో తాను భగవధ్యానంచేస్తాడు. ఇక ప్రయాణం అయితే రైల్వే ప్లాటుఫారమయినా శుభ్రంగా ప్రార్థనచేసుకుంటారు. మనమంతా డేమ్‌షేమ్."

అంతా పకాలుమన్నారు.

"ఇంకా మనలోని నార్తుకి వెళ్లినకొద్దీ ఏదో కాస్త గాడ్‌లీఫియరు కనిపిస్తుంది. సౌతులోను ఫరవాలేదు. ఇక ఎటొచ్చీ మధ్యని అంతా సర్వం మిథ్య."

"పోరా నువ్వు మరీచెప్తావు ఎగ్జాజిరేషను"

"షూట్‌చేస్తాను, అమాటంటే! నన్ను ఎగ్జాజిరేషను అనడం ఎందుకు? గో అన్ మంత్రాలు పనిచేస్తాయా లేదా అన్నది పెద్ద డిబేటు. అసలు మంత్రాలు లేనేలేవని కొంతమంది. జ్యోతిషం ఏమీకాదని కొంతమంది. దేముడూ దెయ్యం నైజాంతా అదంతా సింపుల్ సైకలాజికల్ ఎఫెక్ట్సు అని కొందరు. ఛాదస్తం, పూర్వకాలం మూఢనమ్మిక, పూర్వాచారం బ్లైయిండ్‌బిలీఫ్, ఆర్థడాక్స్ అంటూ కొందరు"

"అందరికందరే మరియు నందరి కందరెయందరందరున్" అన్నాడు చంద్రం.

"అది సరి దేముడున్నాడంటే అది బ్లైండ్ బిలీఫ్ అంటే గ్రుడ్డి. మరి లేదన్నది అది ఏ బిలీఫో? బహుశా ఇంకా నామకరణంజరిగి వుండదు!"

"అఫ్‌కోర్సుగాడ్ ఉంటే ఉండొచ్చు! గాని లివింగ్‌గాడ్‌మాత్రం లేదురా!" అన్నాడు సీరియస్‌గా.

"ఎగ్జాక్ట్‌లీ....ఎంచేతంటే ఇలాంటివాళ్లంతా కలసి శ్మ శా న ం గా తయారుచేసారు. ఇకనందులో లివింగ్‌గాడ్ ఎలా వుంటాడు?"

"ఒరే యీ వెధవ ఆర్గ్యుమెంట్సెందుకు? కమాన్ గాడ్ అంటూవుంటే! చూపించు లేదా! ఎవరినైనా సరే చూపించమను. అప్పుడు నేను నమ్ముతాను. ఈ ట్వన్‌టీయత్ సెంచరీలో అంతా ప్రాక్టికల్ అంతేగాని నో ఇమేజినేషన్సు ఎండ్ సపొజిషన్సు!"

"అయితే నువ్వు పెరసనల్‌గా చూడని దేనినీ నమ్మదల్చుకోలేదన్నమాట! కెన్ యు స్టాండ్?"

"డెఫెనెట్‌లీ మీలాగ బ్లైండ్‌గా బిలీవ్‌చేస్తు కూర్చోడానికి నేనేం దద్దమ్మను గానురా అబ్బాయి! మైండ్ దట్. వీడొకడు ఛాలెంజి చేస్తున్నాడ్రా....బోడి ఛాలెంజి."

"అయితే సింపుల్ క్వశ్చన్. భూమి గుండ్రంగా ఉందన్నారు గదా! నువ్వుకూడా నమ్ముతున్నావు. అయితే నువ్వు ప్రాక్టికల్‌గా చూశావురా చేత్తోపట్టుకుని?"అన్నాడుకైలాసం.

"ఏడవలేకపోయావురా వెర్రివెధవ, ఇదేనా స్కూల్లో ఇన్నాళ్ళూ నేర్చుకున్న సెన్సు?"

"అది వేరు! అక్కడ విన్నది నాకు జాలు. ఫరవాలేదు గాని, పెరసనల్‌గా చూడనిది నమ్మనని కబుర్లుదంచుతున్నావే! ఆ నీలాంటి వాళ్ల సంగతేమిటే అని?"

"అదా! సైంటిస్టులు స్వయంగా అబ్జర్వు చేసేరు. కావాలంటే కావలసినన్ని ఎగ్జాంపుల్స్ యిచ్చారు. అంత బ్లైండుగా చెప్పలేదులే!"

"ఇదీ అలాగే దేముడున్నాడని, వాళ్ళ శక్తితో ఆదేముడిని చూసినవాళ్లే వాళ్లకు తెలిసినన్ని ఎగ్జాంపుల్స్ యిచ్చారు. ఇంకా క్లియరుగా పురాణాల్లో వ్రాశారు. ఐతే చిన్నవిశేషం వుందిలే. ఆ పురాణాలు నీకు నాకు ఎండ్ సో కాల్డు గ్రాడ్యుయేట్స్‌కి అర్థంఅయిసావవు. దానికి కాస్త తెలుగు రావాలి మరి."

"పోరా మనకి తెలుగే రాకపోతే ఇంక వచ్చిందేమిటి? అబ్జర్డు"

"ఏదొచ్చినా మానినా! మనకు రానిదే తెలుగు. అది సరి. ఈ భూమి గుండ్రంగా వుందని మీరు చూడనిది ఎలాగు బిలీవ్‌చేస్తున్నారా అని?"

"అది చెప్పేను కదురా! సైంటిస్టులు ప్రూవ్ చేసారు, ప్రాక్టికల్‌గా అబ్జర్వ్‌చేసి, గౌర్నమెంటు ఎప్రూవ్‌చేసారురా! అంత సుళువుగా లేదు!"

"ఆ కాలంలో ఆ గౌర్నమెంటుకూడ వప్పుకున్నారు. వాళ్లుకూడ అంత వెర్రిగా చెప్పలేదు. ఆ నిదర్శనాలు ఇంకా వున్నాయి తెలుసా!" అన్నాడు కామేశం.

"అ....ఎవడు చూడొచ్చాడురా వాడెళ్లి గాడ్‌ను చూసేడోలేదో! ఏదో లివింగ్‌గాడ్ అందరిమధ్యలో రాముడు, క్రిష్ణుడు అంటూ తిరిగేడు అంటే కొంత బిలీఫ్‌కి స్ట్రాంగావుంటుందని వ్రాసిపారేశారు. అంతా అయమాయ గారడీ. లేకపోతే అప్పుడు కనపడినవాడు ఇప్పుడెందుకు కనపడలేదురా. మరి?"

"నీకు ఏదిమాత్రం కనపడి యేడిసింది. నీకు కనపడేవల్లా నీముఖం. అదైనా అద్దంలో చూస్తేనే! నీకేకాదు ప్రపంచంలో ఎవడైనా సరే భూమి గుండ్రంగా ఉన్నట్టు చూసారా అని? ఏదో ఆధారాలమీద ఊహించారు. తతిమ్మా వాళ్లకు చెప్పారు నమ్మమన్నారు. వాళ్ళు నమ్మారు. యదార్థానికి తలా తోకా కూడా తెలీదు. అయినా వాళ్ళు చెప్పినదానికి అంతా వప్పుకున్నాం. అంతే కాని, ఏదీ ఆ భూమిని ఇలా తీసుకువచ్చి చూపించు గుండ్రంగా ఉందోలేదో చూస్తాను, అంటే ఆ సైంటిస్టుల గతేంకాను?" అన్నాడు కైలాసం.

"పోరా నీ బోడి కంపేరిజను నువ్వూను. మీనింగ్ లెస్ ఆర్గ్యుమెంట్స్."

"అదికాదు చెప్పింది విను—నువ్వేకాదు! ఎవడైనాసరే స్వయంగా చూడని దేనినీ నమ్మకూడదనుకుంటే, ప్రపంచంలో మిగిలేది వాడొక్కడే. ఒకే ఒక్కటి ఆలోచించు భూమి గుండ్రంగా వుందని చూచిన వాళ్లెంతమంది? భూమికీ సూర్యునికీ మధ్యదూరం టేపుపెట్టి ఎంతమంది కొలిచారు? అసలు అంతవరకూ ఎందుకూ ఫారిన్‌కంట్రీస్, అమెరికా ఇంగ్లండు నువ్వు చూడలేదు. అందుచేత అవిలేవు. అంతే కదురా? ఒకవేళ ఎవడైనా ఉన్నాయంటే! ఏదీ ఉంటే ఆ అమెరికాని తెచ్చి నాకు చూపించు, చూసి అప్పుడు నమ్ముతాను అంటావ్" అంతా గొల్లుమన్నారు. ఎంత సీరియస్‌గావున్నా శంకరంకూడా నవ్వేశాడు.

"అది నిజమేన్రా, అలాపోతే అసలు మెడ్రాసు, బాంబేయ్, కలకత్తా, ఢిల్లీలు కూడా దీనిక్రిందే జమ. ఎంచేతంటే మనం చూడలేదు. గనుక అవిలేవు అని మనకి ప్రూవ్ అయిపోయింది. ఎంచేతంటే ఇదిగోరా ఇది మెడ్రాస్ ఇది ఢిల్లీ అని ఎవడూ తీసుకవచ్చి మనకి చూపించలేడు. ఆ ప్రూఫ్‌ప్రకారం మనం వాటిని చూడ్డానికి ట్రైచేసే క్వశ్చనే మరిలేదు. ప్రాబ్లమ్ సాల్వ్ పోయింది" అన్నాడు భాస్కరం.

అంతా నవ్వేశారు. శంకరం ఆముదం ముఖం పెట్టేడు.

"అంచేత నన్నడిగితే, ఏదైనా విషయం నమ్మశక్యంకాదు అని ఖచ్చితంగా నమ్మినపుడు, అల్లా వాడి నెవడినో తెచ్చి చూపించమన్నాను, వాడు చూపించలేదు, అంచేత నేను నమ్మను అని పైవార్లమీద డిపెండ్ అవకూడదు. నీకు అనుమానం వుంటే నువ్వే స్వయంగా పూనుకోవాలి. అలాగే దేముడి విషయంగూడాను. నువ్వు స్వయంగా బయల్దేరు. అంతు తేల్చుకో. అంతేగాని ఇలాంటి హస్కువల్ల లాభంలేదురా అబ్బీ" అన్నాడు కామేశం.

"అది నీ తప్పుకాదురా! అది యావదాంధ్రులదీను. అంటే సోకాల్డు హాఫ్ నాలడ్జుడు ఉన్నారే ఈ ఎడ్యుకేటెడ్ ఎండ్ ఫైల్డ్‌గాళ్ళు, వాళ్లనంతా పెరసంటేజి. ఒక సామెతవుందిలే "సత్రంలో భోజనం, మఠంలో నిద్ర" ఆ కేటగిరీలోకి వస్తారు. ఏదో చదువైతే స్కూలు లేకపోతే ఆఫీసు అయిపోగానే హొటలు భోజనంలాగా ఇంట్లో గబగబలాడించేసి టిప్ టాప్‌గా మెయిన్‌రోడ్డు లేకపోతే బీచ్ పట్టేస్తారు. అవే వాళ్ళకి శరణాలయాలు. అంతకన్నా రెస్పాన్సుబిలిటీస్ అండర్‌టేక్ చేసే కెపాసిటీస్ లేవు. అదీ అసలు రహస్యం. దానికి ఒక చిన్న పులితోలు తగిలిస్తారు. ఇహ నక్కడికి వీడే ఏదో పెద్దపొడిచేసిన ఎడ్వాన్సుడుఫెలో అని అంతా అనుకోవాలని వాడి తాపత్రయం. ఇంక దేముడు లేడు, అంతా సైలాజికల్ అంటూను. అసలు వీళ్లలో ఎంతమందికి ఆ సైకాలజీకి స్పెల్లింగు తెలుసునా అంటే! అదీ మళ్లీ యథాప్రకారంగా పెరసంటేజి. వీడికి తెలియనిదల్లా యదార్థం ఒక్కటే. నిజంగా ఫారిన్ వాళ్లదగ్గరనుంచి మనవాళ్ళు అందులో ముఖ్యంగా ఈ మహాస్సైల్డు ఆంధ్రులున్నారే తెల్సుకోవలసిన ముఖ్యాతిముఖ్యాలు చాలా వున్నాయి. వాళ్ల గాడ్‌లీషియర్, గాడ్‌కి వాళ్లిచ్చే ఇంపార్టెన్సు, ఆ గాడ్‌ముందర పెద్దా చిన్నా భేదంలేకపోవడం, సమయం వచ్చినప్పుడు వాళ్ళలోవున్న యూనిటీ, ఇలాంటి ఇంపార్టెంటు ఫాక్టర్సు కొన్ని వేలున్నాయి" అన్నాడు కైలాసం.

"ఇంకొక్కటి ఏదైనా అగస్మాత్తుగా జరిగితే 'ఓ మై గాడ్' లేకపోతే 'మైగుడ్ గాడ్'. అంటారు. మనం 'వెధవది' అంటాం. 'ఇంకా ఉన్నాయిలే మనం చెప్పుకోలేం' అన్నాడు చంద్రం.

"కాగా వాళ్ళల్లో ఏ మెడకో చేతికో ఒక సిలువ ఉండితీరుతుంది. మనం ఉట్టప్పుడు లెనేలేదు, అధమం ఏ శివాలయానికైనా వెళ్తే అక్కడ బొట్టుపెట్టుకోవడానికి పేద్ద ఇన్‌ఫీరియారిటి, బిలో డిగ్నిటీ ఎన్నివస్తాయ్ తెలుసునా?' అన్నాడు కైలాసం.

"అంతా పకాలుమన్నారు. 'పాండ్రా! మీరింకా స్టిల్ టు బి రిఫైండ్' అంటూ లేచాడు శంకరం. వాడి వెనకాలంతా లేచారు కాఫీ త్రాగడానికి.

★